క్లుప్తంగా

అర్హులకు పథకాలు అందాలి

నరసరావుపేట: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు వ్యవహరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాదు పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ అతిథిగృహంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు నిర్వహించిన శిక్షణా తరగతుల హాజరై వారికి పలు సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్, మున్సిపల్ ఇంజినీరు డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

వినుకొండ టౌన్: పట్టణంలో జరుగుతున్న దొంగతనాలు అరికట్టేందుకు షాపు యజమానులు, నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పట్టణ సీఐ సాంబశివరావు సూచించారు. పట్టణంలోని సురేష్ మహల్ రోడ్, ఆర్టీసీ బస్టాండ్‌లో గల షాపు యజమానులు, నిర్వాహకులతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రతి దుకాణం లోపల, బయట వైపునకు ఉండే విధంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీనివల్ల షాపులలో, బస్టాండ్ ఆవరణలో జరిగే గొడవలు, దొంగతనాలు అరికట్టవచ్చన్నారు.

యడ్లపాడులో నేడు క్విజ్ పోటీలు

యడ్లపాడు: ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మండల స్థాయి క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు యడ్లపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం జి.వి జయభారతి మంగళవారం చెప్పారు. విద్యార్థులకు ఆర్థిక విద్యపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఆర్‌బీఐ (రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో ఈ క్విజ్ పోటీలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మండల కేంద్రమైన యడ్లపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల్ల ప్రాంగణంలో బుధవారం ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభం అవుతాయన్నారు.

నేడు యోగా సంబరాలు

నరసరావుపేట రూరల్: ప్రపంచ యోగా దినోత్సవ సంబరాలను లింగంగుంట్లలోని అమృత సరోవర్ చెరువు వద్ద నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 6గంటలకు నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

నేడు సీఆర్ కళాశాలలో..

నాదెండ్ల: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గణపవరం సీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో యోగా డే నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 8 గంటలకు జరిగే కార్యక్రమానికి విద్యార్థులు, యోగాభ్యాసకులు హాజరుకావాలని కోరారు.

ఎంఈవో–2గా రామతులసి

ఈపూరు: మండల విద్యాశాఖ అధికారి–2గా రామతులసి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. దుర్గి మండలం ముటుకూరులో ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తూ ప్రమోషన్ పొంది బదిలీపై ఈపూరు వచ్చారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు ఉపాధ్యాయులు కలిసి అభినందించారు. ఆమె గతంలో ఇక్కడ ఈపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలుగా పనిచేశారు. పూర్వ విద్యార్థులు స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఆమెను సన్మానించారు.

28లోగా దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న మూడు అంగన్‌వాడీ కార్యకర్త, ఏడు సహాయకురాలు పోస్టుల నియామకానికి ఈనెల 28వ తేదీలోగా అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సమగ్రశిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) ప్రాజెక్టు అధికారి యు.ఉమామహేశ్వరి మంగళవారం కోరారు. అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు నరసరావుపేట పట్టణం ప్రకాష్‌నగర్ సెక్టార్‌లోని నవోదయనగర్ ఒక ఎస్సీ, రామిరెడ్డిపేట కేంద్రంలోని ఒక ఓసీ, మండల పరిధిలోని గురవాయపాలెం సెక్టార్‌లోని యక్కలవారి పాలెంలో ఒక బీసీ పోస్టు భర్తీ చేయబడుతుందన్నారు. నరసరావుపేటలోని బీసీకాలనీ, చాకిరాల మిట్ట సబ్‌స్టేషన్ ప్రక్కనే ఉన్న శిశు అభివృద్ధి అధికారి కార్యాలయంలో 28వ తేదీ సాయంత్రం ఐదుగంటల్లోగా అందజేయాలని కోరారు.

అధికారులు తనిఖీలు

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో తూనికలు కొలతలు అధికారులు వ్యాపార సంస్థలు, బేకరీలను తనిఖీలు మంగళవారం చేశారు. ఈసందర్భంగా నరసరావు పేట డివిజన్ తూనికలు కొలతలు అధికారి డి. శివశంకర్ మాట్లాడుతూ వ్యాపారసంస్థల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు.

ఇంటర్ తరగతులు ఆరంభం

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో బాలికల జూనియర్ కళాశాల తరగతులు ప్రారంభమైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డుపల్లి విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం హెచ్‌ఎం మాట్లాడుతూ ఎంపీసీ, బైపీసీ రెండు గ్రూపులకు సంబంధించి అనుభవం కలిగిన ఏడుగురు ఉపాధ్యాయులను ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిందని చెప్పారు. ఉపాధ్యాయులు ప్రత్యేకంగా గ్రామాల్లో పర్యటించటం వలన విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వచ్చినట్లు తెలిపారు. ఇంకా దరఖాస్తులు స్వీకరణ జరుగుతుందన్నారు. నాణ్యమైన విద్యతోపాటు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా మంచి ఫలితాలు సాధించటానికి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి నాణ్యమైన విద్యను బోధిస్తామన్నారు.



పాఠాలు బోధిస్తున్న శ్రీనివాసరాజు

ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఘనత జగనన్నదే

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- పెదకంచర్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

వినుకొండ(నూజెండ్ల): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండ రూరల్ మండలం పెదకంచర్ల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలసి గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రచారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల గ్రామాలకు సైతం సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత తమదే అన్నారు. పేదరికం వల్ల చదువులు ఆగిపోకూడదని అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఎన్నో పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయాలు, రైతులు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన పరిపాలన అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో వినుకొండ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. పెదకంచర్ల గ్రామానికి నూతన సీసీ రోడ్డు నిర్మించామని, అలాగే గ్రామంలో మౌలిక వసతులు కూడా కల్పించడం జరిగిందన్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా తెలుసుకునేందుకు గ్రామాల్లో ప్రభుత్వ అధికారులతో కలిసి ఇంటింటికీ తిరుగుతున్నట్లు చెప్పారు.

అర్హత ఉండి ఇంకా ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి పథకాలు అందించడమే గడప గడపకు మన ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నియోజకవర్గాన్ని గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేస్తున్నారని, రానున్న రోజుల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దండు చెన్నయ్య, ఎంపీపీ జయశ్రీవెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి, తహసీల్దార్ కిరణ్‌కుమార్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు.



పథకాల వివరాలను వెల్లడిస్తున్న, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన

ఊడిజర్ల వాసులకు చిక్కిన మోటార్ల దొంగ

ఈపూరు: పొలాల్లో నీటి మోటారును అపహరిస్తుండగా అతనిని పట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన సంఘటన మండలంలోని ఊడిజర్ల గ్రామంలో వెలుగుచూసింది. గ్రామంలో కాలువ పక్కనే పొలాలకు ఏర్పాటు చేస్తున్న మోటారును ఎర్రగుంట తండాకు చెందిన రామావత్ బాబా నాయక్ వైర్లు కట్ చేసి అపహరిస్తుండగా అటుగా వచ్చిన రైతులు గమనించారు. అతనిని పట్టుకొని దేహశుద్ధి చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. అయితే అప్పటికే ఒక మోటారును అపహరించి రెండో మోటారును అపహరించడానికి వచ్చినప్పుడు రైతులు పట్టుకున్నారు. ఇతనితో పాటు ఉన్న మరో ఇద్దరు దొంగలు పరారీలో ఉన్నారని ఇన్‌చార్జి ఎస్‌ఐ బలరాంరెడ్డి పేర్కొన్నారు. వీరు గతంలో అనేక మోటార్లు, ట్రాక్టర్ గొర్రులను కూడా అపహరించినట్లు గ్రామస్తులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బలరాంరెడ్డి పేర్కొన్నారు.

‘జగనన్న సురక్ష’ను జయప్రదం చేయండి

- 9 రకాల ధ్రువపత్రాలు అందించే ప్రతిష్టాత్మక కార్యక్రమం
- వినుకొండ ఇన్‌చార్జి కమిషనర్
- వేర్వేరు మండలాల్లో అధికారుల సమీక్ష

వినుకొండ టౌన్: వార్డు సచివాలయల ద్వారా పురపాలక సంఘం పరిధిలోని ప్రజలకు 9 రకాల ధ్రువపత్రాలను సత్వరమే అందించేందుకు, రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఇన్‌చార్జి కమిషనర్ వెంకయ్య పేర్కొన్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు పట్టణంలోని కొత్తపేట 1, 2, లాయర్స్ స్ట్రీట్ 1, 2, శాలివాహన నగర్ 1, 2 సచివాలయల పరిధిలోని సచివాలయ సిబ్బందికి, వార్డు వలంటీర్లకు కార్యక్రమంపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 1న నిర్వహించనున్న క్యాంపునకు ముందుగా జూన్ 24 నుంచి వార్డు ప్రజలకు అవగాహన కల్పించి, కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, వివాహ ధ్రువీకరణ, ఆధార్‌కు ఫోన్ నెంబర్ అనుసంధానం, జనన ధ్రువీకరణ, మరణ ధ్రువీకరణ, మ్యూటేషన్ లావాదేవీలు, కుటుంబ సభ్యుడి ధ్రువీకరణ, పంట సాగు హక్కు వంటి 9 పత్రాలను వార్డులలోని ప్రజలకు అందే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అబ్బూరి వెంకటేశ్వర్లు, మేనేజర్ శ్రీనివాసరావు, ఏఈ చంద్రశేఖర్, ఇతర అధికారులు, వార్డు కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నాదెండ్లలో..

నాదెండ్ల: వచ్చే నెల 1 నుంచి నెలరోజుల పాటు అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకోవాలని ఎంపీడీవో జాకీర్ హుస్సేన్ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జగనన్న సురక్ష పథకంపై సచివాలయ సిబ్బంది, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 24న జగనన్న సురక్షా పథకంపై లాంఛనంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభిస్తారన్నారు. 30 రోజుల పాటూ జరిగే కార్యక్రమంలో ప్రతి గృహాన్ని సందర్శించి వారికి అవసరమైన ధ్రువపత్రాలు, సంక్షేమ పథకాలకు అవసరమైన వివరాలు తెలుసుకుని ఆగస్టు నాటికి అందించాలన్నదే ముఖ్య ఉద్దేశమన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఎంపీపీ తలతోటి రాణి మాట్లాడుతూ, ప్రభుత్వం ఇప్పటికే జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నదని, ఈ కార్యక్రమానికి జగనన్న సురక్ష అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. పథకాల అమలులో సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలన్నదే పథకం ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ రమణ, ఏవో హరిప్రసాద్, డీటీ అనురాధ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కమిషనర్ వెంకయ్య

జగనన్న సురక్షపై శిక్షణ

వినుకొండ(నూజెండ్ల): జగనన్న సురక్ష కార్యక్రమంలో నూజెండ్ల ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు శిక్షణ మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వీరభద్రాచారి మాట్లాడుతూ వలంటీర్లు గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించి, కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, వివాహ ధ్రువీకరణ, ఆధార్‌కు ఫోన్ నెంబర్ అనుసంధానం, జనన ధ్రువీకరణ, మరణ ధ్రువీకరణ, మ్యూటేషన్ లావాదేవీలు, కుటుంబ సభ్యుడి ధ్రువీకరణ, పంట సాగు హక్కు వంటి 9 పత్రాలు ప్రజలకు అందే విధంగా చూడాలన్నారు. ఎవరికైనా సమస్యలు ఉన్నట్లయితే సంబంధిత అధికారి వద్దకు తీసుకెళ్లి పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో జగనన్న సురక్షా అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో మండల తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో వై.హనుమారెడ్డి పాల్గొన్ని ప్రసంగించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు మిగిలిపోయిన అర్హులు, వారి సమస్యల్ని గుర్తించేందుకు ప్రతి ఇంటిని సందర్శించేలా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్షా కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పథకాలు, వివిధ సర్టిఫికెట్స్‌పై ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని, అర్హులుగా గుర్తించిన వారికి ఆగస్టు ఒకటి నుంచి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇంటింటికి వెళ్లే క్రమంలో ఆయా సమస్యల్ని ప్రత్యేక యాప్‌లో వారి వివరాలను నమోదు చేసి ధ్రువపత్రాలు మంజూరు చేయాలని చెప్పారు.

అధికారులు సమన్వయంతో పనిచేసి..ఆయా సేవలకు ఎలాంటి రుసుం ప్రజల నుంచి వసూలు చేయకూడదని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వరూధిని, డీటీ శ్యామలత, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే రీసర్వే చేయాలి

- రీసర్వే బృందాలకు జేసీ శ్యాంప్రసాద్ ఆదేశం
- నాలుగు గ్రామాల్లో జగనన్న రీసర్వే పనుల పరిశీలన

నాదెండ్ల: జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష రీ సర్వే చేసే గ్రామాల్లో రైతులకు ముందుగా నోటీసులు ఇచ్చాకే సర్వే పనులు ప్రారంభించాలని జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ చెప్పారు. మండలంలోని నాలుగు గ్రామాల్లో జరుగుతున్న జగనన్న రీసర్వే పనులను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గణపవరంలో జరుగుతున్న రీసర్వే పనులు పరిశీలించి వీఆర్వోలు, సర్వే బృందాలకు సూచనలిచ్చారు. గణపవరంలో 2300 మంది రైతులకు గాను 4596 ఎకరాలు భూమి ఉందని, గత నెల 29న రీసర్వే పనులు ప్రారంభమయ్యాయని, ఇప్పటి వరకూ 1546 ఎకరాలు రీసర్వే పనులు పూర్తయ్యాయని, మొదటి విడతలో కనపర్రు, సంకురాత్రిపాడు, చందవరం, చిరుమామిళ్ల, గొరిజవోలు గ్రామాల్లో పూర్తయ్యాయని, రెండో విడత కొన్ని గ్రామాలు కాగా, మూడో విడతలో గణపవరం, తూబాడు, సాతులూరు, ఇర్లపాడు గ్రామాల్లో సర్వే పనులు జరుగుతున్నాని సర్వేయర్ అబ్బూరి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా జేసీ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ, రైతులకు కనీసం ఒక్కరోజు ముందుగా సమాచారం అందించి వారి సమక్షంలోనే రీసర్వే పనులు చేయాలన్నారు. రైతులకు ఎక్కడా సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 120 రోజుల్లో పూర్తిగా రీసర్వే పనులు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే రికార్డులు పరిశీలించారు. ఆయనతో పాటూ తహసీల్దార్ ఏవీ రమణ, డీటీ అనురాధ, ఆర్‌ఐ షేక్ రమీజా, వీ ఆర్వోలు సాంబశివరావు, వెంకటరమణ, వీరయ్య, గ్రామ సర్వేయర్లు ప్రసన్న, పవన్, సైదాబీ, అనిల్ ఉన్నారు.



గణపవరంలో రీసర్వే పనులు పరిశీలిస్తున్న జేసీ శ్యాంప్రసాద్

పారదర్శకంగా రీసర్వే పనులు

ఈపూరు: భూముల రీసర్వే పనులు వేగవంతంగా, పారదర్శకంగా జరుగుతున్నాయని ఆర్డీవో శేషిరెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి మంగళవారం వచ్చిన ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇనిమెళ్ల గ్రామానికి చెందిన కొత్త వెంకటేశ్వర్లు తనకు సర్వే నెం. 578లో ఎకరం 42 సెంట్లు ఉండగా రీసర్వేలో ఎకరం 21 సెంట్లు వచ్చిందని స్పందనలో ఫిర్యాదు చేశాడని, అయితే అదే సర్వే నంబరులో గల ముల్లపాటి వీరయ్య తమకు 86 సెంట్లు తగ్గిందని ఫిర్యాదు చేశాడని, ఫిర్యాదు మేరకు విచారణ నిమిత్తం వచ్చినట్లు పేర్కొన్నారు.

అయితే పూర్తిగా విచారణ చేపట్టి నిజమైన ఫిర్యాదుదారులకు న్యాయం చేస్తామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని బొమ్మరాజుపల్లి, గుండేపల్లి, వనికుంట గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, వనికుంటకు సంబంధించిన పాస్ పుస్తకాలు త్వరలో పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. చిట్టాపురం, దాసులపల్లి, ఈపూరు, కొండాయపాలెం, కొండ్రముట్ల రికార్డులు తయారు చేస్తున్నారని, అగ్నిగుండాల, ఇనిమెళ్ల, కొచ్చర్లలో గ్రౌండ్ ట్రూత్ జరుగుతుందని, ఆ సమయంలో భూముల యజమానులు తమకు ఉన్న ధ్రువపత్రాలు తీసుకొచ్చి సంబంధిత సర్వే సిబ్బందికి హద్దులు చూపించాలన్నారు. అలాగే చివరిగా 92 నోటీసు జారీ చేస్తామని, అభ్యంతరాలు ఉంటే తెలపవచ్చన్నారు. డివిజన్‌లో 66 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, 42 గ్రామాల్లో 30 వేల హక్కుపత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ నెల మరో 20 గ్రామాల్లో పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో రీసర్వే త్వరగా పూర్తి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని శేషిరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలతో మెరుగైన ఫలితాలు

విద్యాశాఖ ఆర్జేడీ సుబ్బారావు

నాదెండ్ల: విద్యారంగాన్ని బలోపేతం చేసి విద్యార్థులకు మెరుగైన భవిష్యత్‌ను ఇచ్చేందుకు ప్రభుత్వం విద్యావ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించిందని పల్నాడు జిల్లా విద్యాశాఖ ఆర్జేడీ సుబ్బారావు చెప్పారు. నాదెండ్ల మండలం చిరుమామిళ్లలోని ఏపీ మోడల్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ ఏడాది పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పాఠశాల స్థాయిలో ముగ్గురిని ఎంపిక చేసి వారికి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా నగదు ప్రోత్సాహకాలు అందించారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఎం తులసీపావనికి రూ.3 వేలు, లక్ష్మీప్రసన్నకు రూ.2 వేలు, ప్రసన్నలక్ష్మికి రూ.1 వెయ్యి చొప్పున నగదు, ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సింగారెడ్డి లక్ష్మి, ప్రిన్సిపల్ ఝాన్సీవాణి, ఎంపీపీ తలతోటి రాణి, నాదెండ్ల సొసైటీ చైర్మన్ కురుకుట్ల వెంకటరెడ్డి, పార్టీ నాయకులు మద్దూరి కోటిరెడ్డి, సింగారెడ్డి కోటిరెడ్డి, మద్దూరి బాలచంద్రారెడ్డి, టీజే రత్తయ్య, అల్లడి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



చిరుమామిళ్ళ మోడల్ పాఠశాలలో విద్యార్థులకు నగదు అవార్డులు అందిస్తున్న ఆర్జేడీ సుబ్బారావు

నడికట్టు రామిరెడ్డి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో...

చిరుమామిళ్లలోని నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పాఠశాల స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన మాలె శ్రీనివాస్‌కు రూ.3 వేలు, షేక్ ఇర్షాన్, వీరసాయిలకు ఒక్కొక్కరికీ రూ.2 వేలు, చెన్నకేశవరెడ్డికి రూ.1వెయ్యి, ప్రశంసా పత్రాలను అందించారు. అనంతరం పాఠశాలలో జేవీకే కిట్లు వివరాలు, పంపిణీ వివరాలు తెలుసుకున్నారు. హెచ్‌ఎం సుందరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువుల్లో అక్రమ తవ్వకాలు ఆపాలి

ఈపూరు: పంట సాగు చేసుకుంటున్న భూముల పక్కన చేపల చెరువులను అక్రమంగా తవ్వి మా పంటలకు ఇప్పుడు నీరు లేకుండా కొందరు చేస్తున్నారని మండలంలోని బోడెపూడివారిపాలెం గ్రామానికి చెందిన రైతులు రెవెన్యూ, పంచాయతీ, ఫారెస్ట్, మైనింగ్ శాఖల అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన గుంటూరు పెదఅంజయ్య, గుంటూరు చిన అంజయ్య, యడవల్లి వెంకటేశ్వర్లు, యడవల్లి సుబ్బారావులు కొండ్రముట్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 58-1, 58-ఎ, 60/4, 60/11, 54/4, 80 నందు పొలం కలిగి ఉన్నారు. ప్రతి సంవత్సరం వీరి జీవనాధారమైన ఆ పొలంలో వరి, తదితర పంటలు వేసి సాగు చేస్తున్నారు. అయితే ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా చెరువులు తవ్వుతున్నారని, అందువల్ల మా పొలాలు నీటి మునిగి సాగు చేసుకోకుండా ఎందుకు పనికిరాకుండా పోయే ప్రమాదం ఉందని వారు ఆవేదన వెలిబుచ్చారు. కనుక సంబంధిత అధికారులు అక్రమంగా తవ్వుతున్న చేపలచెరువులను నిలిపివేయాలని వారు ఫిర్యాదు చేశారు.

అంతర్జాతీయ ప్రమాణాలు అత్యద్భుతం

- కేరళ పశుసంవర్ధక, జంతు ప్రదర్శన శాలల శాఖ మంత్రి జె.చెంచురాణి
- వల్లభ పశుదాణా కర్మాగారాన్ని సందర్శించిన కేరళ మంత్రులు, ఎమ్మెల్యేల బృందం

నరసరావుపేట రూరల్: అంతర్జాతీయ ప్రమాణాలతో వల్లభ పశుదాణా కర్మగారాన్ని నిర్వహించడం అభినందనీయమని కేరళ పశుసంవర్ధక, జంతు ప్రదర్శనశాల శాఖ మంత్రి జె.చెంచురాణి తెలిపారు. కేరళ రాష్ట్ర పశు, కోళ్ల సమీకృత బిల్లు–23 అధ్యయనం కోసం చిలకలూరిపేట బైపాస్ రోడ్డులోని వల్లభ పశుదాణా కర్మాగారాన్ని సోమవారం రాత్రి కేరళ మంత్రి జె.చెంచురాణి ఆధ్వర్యంలోని ఎమ్మెల్యేల బృందం సందర్శించింది. సంస్థ చైర్మన్, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎండీ బొల్లా శ్రీనివాసరావులు బృందానికి స్వాగతం పలికారు. కర్మాగారంలో దాణా తయారీ విధానం, తయారీకి తీసుకుంటున్న జాగ్రత్తలను ఎండీ బొల్లా శ్రీనివాసరావు బృందానికి వివరించారు. ఈ సందర్భంగా కేరళ మంత్రి జె.చెంచురాణి మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో పశువుల, కోళ్ల దాణా పరిశ్రమను నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిని అభినందించారు. పశుపోషణకు, పాలఉత్పత్తికి సమీకృత దాణా తయారీ విధానంపై అధ్యయానికి ఏపీలోని ప్రధాన దాణా తయారీ సంస్థలను సందర్శిస్తున్నట్టు తెలిపారు. ఆధునిక ల్యాబ్, అనుభవం కలిగిన న్యూట్రీషినిస్ట్‌ల పర్యవేక్షణలో నాణ్యమైన పశు, కోళ్లదాణాలను వల్లభ అందిస్తున్నట్టు తెలిపారు. సంస్థ చైర్మన్ బ్రహ్మనాయుడు మాట్లాడుతూ పాడి, కోళ్ల రైతుల శ్రేయస్సే ధ్యేయంగా వల్లభా దాణా పరిశ్రమ నెలకొల్పినట్టు తెలిపారు. ఏపీతోపాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో వల్లభ విక్రయాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వల్లభ కర్మాగారాన్ని సందర్శించిన వారిలో ఎమ్మెల్యేలు సి.కె.అషా, జాబ్‌మైఖిల్, సి.హెచ్ కునాయి, కె.పి.కె. కుట్టి మాస్టర్, డి.కె.మురళీ, అధికారులు డాక్టర్ ఉ.కౌసిగన్, అనిల్ గోపీనాథ్, బి.శ్రీకుమార్‌లు ఉన్నారు. వల్లభ సీడ్స్ సీఈఓ వున్నం సైదయ్య, ఆర్‌ఎం గద్దె హరనాథ్‌బాబు, డాక్టర్ కె.కులశేఖర్, పలువురు పాల ఉత్పత్తిదారులు, రైతులు పాల్గొన్నారు.



కేరళ శాసనసభ్యుల బృందానికి స్వాగతం పలుకుతున్న, బొల్లా బ్రహ్మనాయుడు

లబ్ధిదారులకు సంక్షేమం దరిచేరాలి

శావల్యాపురం: అర్హత కలిగిన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందేలా క్షేత్రస్థాయిలో వలంటీర్లు, గ్రామ సచివాలయ ఉద్యోగులు కీలకపాత్ర పోషించాలని డీఎల్‌డీవో పి.వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్షా కార్యక్రమంలో భాగంగా సచివాలయాల వారీగా వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎల్‌డీవో మాట్లాడుతూ ఈనెల 23న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభోత్సవం చేస్తున్నారని, ఈక్రమంలో భాగంగా ప్రతి సచివాలయ పరిధిలో వలంటీర్లు ఇంటింటి సర్వే చేసి ప్రభుత్వ పరంగా జనన, కుల, ఆదాయ, మరణ, ఫ్యామిలీ తదితర ధ్రువీకరణ పత్రాలతో పాటు అర్హత కలిగి ఉన్న ప్రతి లబ్ధిదారుడికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. జూలై 1వ తేదీ నుంచి సచివాలయాల వారీగా వారం రోజుల ముందుగా ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లో ప్రజాసమస్యలకు సంబంధించిన అర్జీలు సేకరించి ఆన్‌లైన్‌లో వలంటీర్లు నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, ఈవోపీఆర్డీ పి.సుగుణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ

వినుకొండ (నూజెండ్ల): ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయమని నాగులవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.మోహన్‌రావు అన్నారు. మంగళవారం వినుకొండ రూరల్ పరిధిలో నాగులవరం గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల్లో పూర్వ విద్యార్థుల తమవంతుగా రూ. 20 వేలు ఆర్థిక సహాయం అందజేశారన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేయటం పలువురికు ఆదర్శమన్నారు. పూర్వ విద్యార్థులు ఆంజనేయులు, మంగాదేవి, సావిత్రి, నరేంద్ర, రాజేంద్రబాబు, మహేశ్వరరెడ్డి, పేరెంట్ కమిటీ చైర్మన్ ఏడుకొండలు, ఉపాధ్యాయులు శారదదేవి, పీఈటీ అంకారావు, శిరీషా సీఆర్‌పీ జక్రయ్య పాల్గొన్నారు.

నరసరావుపేట డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా సునీత

నరసరావుపేట: జిల్లా కేంద్రం డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా డి.సునీత నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఆమె ఏలూరు డ్రగ్ ఇనస్పెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. అలాగే ఇప్పటివరకు నరసరావుపేట డ్రగ్ ఇనస్పెక్టర్‌గా పనిచేస్తున్న ఇ.సాంబశివరావు ఎన్‌టీఆర్ జిల్లా విజయవాడ హెడ్‌క్వార్టర్‌కు బదిలీ చేశారు. అలాగే ఆయనకు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు, భీమవరంకు ఇన్‌చార్జి డ్రగ్ ఇనస్పెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నిర్వహించిన రాష్ట్ర వ్యాప్త డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీల ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే సునీతను ఇన్‌చార్జి పిడుగురాళ్ల డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వ్యవహరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

యడ్లపాడు: మండలంలోని తుర్లపాడు గ్రామంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం కార్యక్రమం జరిగింది. చినకొండ్రుపాడులోని కాటూరి బోధనాసుపత్రి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ పోపూరి వేణుగోపాలరావు సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో గ్యాస్, గుండె, కీళ్లు–ఎముకలు, నేత్ర, చెవిముక్కుగొంతు వైద్య నిపుణులు పాల్గొని వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

సాహిత్య కవితా గోష్టికి రాకేష్

నరసరావుపేట ఈస్ట్: మైసూర్‌లో ఈనెల 25న నిర్వహించనున్న జాతీయస్థాయి తెలుగు–కన్నడ కవితా గోష్టికి పట్టణానికి చెందిన శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శి గుండాల రాకేష్ హాజరు కానున్నారు. కన్నడ సాహిత్య పరిషత్ సౌజన్యంతో అంతర్జాతీయ సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ కవితా గోష్టిని నిర్వహిస్తున్నారు. దేశ వ్యాప్తంగా 120 మంది సాహితీవేత్తలు పాల్గొనే కవితా గోష్టిలో పాల్గొనేందుకు తనకు ఆహ్వానం అందినట్టు మంగళవారం రాకేష్ తెలిపారు.

హెచ్‌సీఎల్ టెక్ బీ శిక్షణకు ఏడుగురి ఎంపిక

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ విద్యార్హతతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పొందేందుకు కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన పరీక్షలో ఏడుగురు అభ్యర్థులు హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రోగ్రాంకు ఎంపికైనట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఇంటర్మీడియెట్ బోర్డు, హెచ్‌సీఎల్ సంస్థ భాగస్వామ్యంతో టెక్ బీ ప్రోగ్రాంకు ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ ఇప్పించి హెచ్‌సీఎల్ సంస్థలో ఉద్యోగ నియామకం జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులకు ఆన్‌లైన్, వ్రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించి టెక్ బీ శిక్షణకు ఎంపిక చేసినట్టు వివరించారు. ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, ఎం.బాలకోటేశ్వరావు పాల్గొన్నారు.



పంటసాగు ధ్రువీకరణ పత్రాలు పూర్తి చేయాలి

బొల్లాపల్లి: కౌలు రైతులకు పంటసాగు ధ్రువీకరణ పత్రాలు త్వరగా పూర్తిచేయాలని ఏవో ఎ.అంకారావు సిబ్బందికి సూచించారు. మండలంలోని అయ్యన్నపాలెం, చక్రాయపాలెం, మేళ్లవాగు ఆర్‌బీకే సెంటర్లను మంగళవారం ఏవో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు తమ గ్రామాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలన్నారు. పీఎం కిసాన్ పథకం వర్తించాలంటే ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు.

కులం పేరుతో దూషించాడంటూ..

యడ్లపాడు: వివాహేతర సంబంధాన్ని ప్రశ్నించినందుకు, అసభ్య పదజాలంతో దూషించిందుకు ఓ వ్యక్తిపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ప్రత్తిపాడు గ్రామానికి ఓ వివాహితకు వివాహేతర సంబంధ ఏర్పడింది. దీన్ని నిలదీయడంతో సదరు వివాహిత అలిగి పుట్టింటికి వెళ్లి కూడా వివాహేతర సంబంధం జరుపుతోందని గ్రహించాడు. వారున్న ప్రాంతంలో పట్టుకుని ఇద్దరినీ ప్రశ్నించిన తనను వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తి కులం పేరుతో దూషించిడమే కాకుండా చంపుతానంటూ బెదిరించాడని స్టేషన్‌లో సదరు వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ రాంబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.